# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 04-09-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమై పలు అంశాలపై చర్చిస్తోంది.**

**2.** **జీఎస్టీ సంస్కరణల ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**

**3.** **కాలానుగుణంగా వచ్చే అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు.**

**4.** **రాష్ట్రంలో రైతులకు యూరియా పంపిణీలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.**

**5.** **స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని అధికారులకు సూచించారు.**

=========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం ఈరోజు కొనగుతోంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో పలు అంశాలపై మంత్రివర్గం చర్చిస్తోంది. సిఆర్డీయే సమావేశంలో చర్చించిన అంశాలపై మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే శాసనసభ సమావేశాల నిర్వహణపై మంత్రివర్గం చర్చించనుంది.

---------------------------

కేంద్ర ప్రభుత్వం వస్తుసేవల పన్ను –జీఎస్టీలో చేపట్టిన సంస్కరణల ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు కొనుగోలు శక్తి పెరుగుతుందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కేంద్రమంత్రి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ మినహాయింపులో విద్యా, వైద్యం, ఆరోగ్య, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ఈ నిర్ణయాల వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30..సెకన్లు

---------------------------

కాలానుగుణంగా వచ్చే అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గుంటూరు జిల్లాలోని తురకపాలెంలో విషజ్వరాలకు సంబంధించిన కారణాలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వైద్య బృందంతో ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తురకపాలెంలో సేకరించిన రక్త నమూనాల పరీక్షల ఫలితాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

---------------------------

రాష్ట్రంలో రైతులకు యూరియా పంపిణీ విషయంలోఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. 48 వేల 478 మెట్రిక్ టన్నుల యూరియాను మార్క్ ఫెడ్ ద్వారా రైతులకు పంపిణీ చేశామని ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు చివరి నాటికి 2 లక్షల 4 వేల 96 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసామన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా యూరియా సరఫరా, పంపిణీని పూర్తి పారదర్శకంగా చేపట్టామని తెలిపారు. విజిలెన్స్, రెవెన్యూ అధికారుల ఎప్పటికప్పుడు తనిఖీలు చేయడం ద్వారా మార్కెట్ లో అందుబాటు ధరలోనే యూరియా లభ్యమవుతోందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్ర తోలు పరిశ్రమాభివృద్ధి సంస్థ -లిడ్ క్యాప్ భూములను ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం పిపిపి విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో లిడ్ క్యాప్‌పై అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తోలు పరిశ్రమల అభివృద్ధికి తిరుపతి, విజయవాడ నగరాలలో మల్టీపర్పస్ వాణిజ్య సముదాయాల నిర్మాణాలను చేపట్టనున్నామని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి విధి, విధానాలు రూపొందిస్తామని మంత్రి వివరించారు.

---------------------------

కర్నూలులో వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. కర్నూలులో ఈరోజు శోభాయాత్ర నిర్వహించనున్న నేపథ్యంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ మళ్ళింపులు చేపట్టామన్నారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం కార్యక్రమం జరిగేలా 2వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలుపుతూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని పంచాయతీ రాజ్, పురపాలక శాఖ కమిషనర్లకు లేఖ రాశారు. మున్సిపల్ చట్టం ప్రకారం స్థానిక సంస్థల పదవీకాలం ముగిసేందుకు మూడు నెలల ముందు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పంచాయతీల విలీనం, అప్‌గ్రేడేషన్ వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. ప్రస్తుత సర్పంచుల పదవీ కాలం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో.. నగరపాలక, పురపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం వచ్చే ఏడాది మార్చిలో

ముగియనుంది. జనవరిలో ఎన్నికల నిర్వహణకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ లేఖలో పేర్కొన్నారు.

---------------------------

వస్తుసేవల పన్ను –జీఎస్టీ స్లాబ్‌లను తగ్గించడం హర్షణీయమని రాష్ట్ర సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంఘం అధ్యక్షులు మురళి కృష్ణ అన్నారు. విజయవాడలో ఈరోజు ఆయన మాట్లాడుతూ.. నిత్యావసరాలు, విద్యా, ఆరోగ్యరంగం, వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పన్నులు గణనీయంగా తగ్గుతాయన్నారు. వీటి ద్వారా రైతుల నుంచి వ్యాపారుల వరకూ అందరికీ ప్రయోజనం కలుగుతుందని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ 34 సెకన్లు

---------------------------

ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని అనంతపురం జిల్లా కలెక్టర్ బి. వినోద్ కుమార్ కోరారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నేత్రదానంపై అనంతపురంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేత్రదానం ద్వారా చూపులేని వారికి చూపునివ్వొచ్చని చెప్పారు. నేత్రదానంపై జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ వివరించారు.

---------------------------

ఉత్తర ఒడిషా పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా కదిలి ఈరోజు ఉత్తర చత్తీస్‌ఘడ్ ప్రాంతంలో అల్పపీడనంగా బలహీనపడిందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులపాటు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మీ తెలియజేస్తూ…

వాయిస్..22 సెకన్లు

---------------------------

కేసులను సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ దోహదపడుతుందని ప్రకాశం జిల్లా న్యాయసేవాధికార సంస్ధ కార్యదర్శి, జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. ఒంగోలులో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ నెల 13వ తేదీన జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లాలో 21 బెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు లోక్ అదాలత్ ను వినియోగించుకుని తమ కేసులను పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలని కోరారు.

---------------------------

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈరోజు నుంచి అవకాశం కల్పించామని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కేవీ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

=====================